నమస్తే తెలంగాణ

సిద్దిపేట

11 | హైదరాబాద్, సోమవారం 18 మార్చి 2024 | SIDDIPET

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలోని గంగరేగు చెట్టు అవరణలో భక్తుల రద్దీ

ఆల్ ది బెస్ట్

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 269 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 46,356 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నాపత్రం విడుదల
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- నిమిషం నిబంధన లేదు.. 9.35 వరకు అవకాశం

సిద్దిపేట అర్బన్/సంగారెడ్డి కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ, మార్చి 17: పదోతరగతి పరీక్షలకు వేళయ్యింది. నేటినుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుంది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. నిమిషం నిబంధన ఏమీ ఉండదని, ఉదయం 9.35 వరకు విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈసారి 7 పేపర్లు...

ఈసారి పదో తరగతి పరీక్షల్లో 7 పేపర్లు ఉండనున్నాయి. గతేడాది 6 పేపర్లు మాత్రమే ఉండగా.. ఈసారి 7 పేపర్లకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఫిజికల్ సైన్స్, బయోలజికల్ సైన్స్ పరీక్షలు వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు. ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ పేపర్లు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు జరగనుండగా.. మిగతా పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు...

పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నాపత్రం రిలీజ్ చేసి, పరీక్ష అనంతరం జవాబు పత్రాలను సీజ్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రంలో కచ్చితంగా విద్యుత్ సౌకర్యం కల్పించి ఫ్యాన్లు, చల్లని తాగునీరు, టాయిలెట్, ఫర్నిచర్, ట్యూబ్ లైట్ లాంటి కనీస సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే పరీక్షా కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం, ఆశవర్కర్ అందుబాటులో ఉండడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని అధికారులు తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు చీటీలు తీసుకురావద్దని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. పరీక్షకు విద్యార్థులు హాల్ టికెట్లు, పెన్, పెన్సిల్, రైటింగ్ ప్యాడ్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. హాల్ టికెట్లు అందని, వాటిని పోగొట్టుకున్న విద్యార్థులు www.bse.telanagana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా లేదా సిబ్బంది ప్రోత్సహించినా 25/97 చట్టం ప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో మొత్తం 80 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 448 పాఠశాలల నుంచి 13,987 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో బాలురు 7,036 మంది, 6,951 మంది బాలికలు ఉన్నారు. ఆరుగురు ప్రైవేటు విద్యార్థులు ఉండగా.. 1,661 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. 80 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 80 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. ప్రతి 20 మంది విద్యార్థులు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించడంతో పాటు పరీక్షలు పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీమ్‌లు, 7 రూట్ ఆఫీసర్లు, 7 అడిషనల్ రూట్ ఆఫీసర్లను, 46 మంది జాయింట్ కస్టోడియన్లను నియమించారు. 23 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతేడాది 118 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మరో 3 పరీక్షా కేంద్రాలను పెంచారు. మొత్తం 22,069 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.121 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు(డీవో)లు విధులు నిర్వహించనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద మండల విద్యాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ల ఫోన్ నెంబర్లను ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు డీఈవో సూచించారు.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో 68 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10,300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 5,079 మంది బాలురు, 5,221 మంది బాలికలు ఉన్నారు. 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 68 మంది డిపార్టుమెంట్ అధికారులు, 600 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 3 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

- పాఠశాలకు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి
- ఉపాధ్యాయుల కృషి, అమ్మానాన్నల ఆశయాలు నెరవేర్చాలి
- పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మార్చి 17: నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామని, ఇందుకు విద్యాశాఖ యంత్రాంగంతో కలిసి సమీక్ష నిర్వహించి, అన్ని వసతులు కల్పించామని తెలిపారు. 'కష్టపడి చదివారు.. మీ కష్టం వృథా కాదని.. మీ భవిష్యత్‌కు పునాది పదో తరగతి.. ఇష్టపడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి'.. అని పిలుపునిచ్చారు. ఉత్తమ ఫలితాలు సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించిన వారికి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొంది ఉన్నత విద్య చదువుతున్నారని, గత రెండేండ్లలో ఉత్తీర్ణతలోనూ, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడంలో సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ స్థానాన్ని నిలబెట్టుకొని ముందుతరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మీరంతా ఏకాగ్రతతో పరీక్షలు రాసి అద్భుతమైన ఫలితాలు సాధించాలని కోరుతున్నట్లు తెలిపారు.

భక్తజన జాతర

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

- 9వ వారం 35వేల మంది భక్తుల దర్శనం
- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చేర్యాల, మార్చి 17: భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తులతో నిండిపోయింది. బ్రహ్మోత్సవాల 9వ ఆదివారం సందర్భంగా 35వేల మంది కొమురవెల్లికి వచ్చినట్లు ఆలయ ఈవో ఎ.బాలాజీ తెలిపారు. సోమవారం పుణ్యస్నానాల అనంతరం క్యూలో గంటల పాటు వేచి ఉండి స్వామిని భక్తులు దర్శించుకున్నారు. పూజులు చేసి గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. సంతానం కలగాలని ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టి స్వామిని వేడుకున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బంగారు రుద్రాక్షమాల సమర్పించిన భక్తుడు

కొమురవెల్లి మల్లికార్జున స్వామికి హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన భీమబోయిన ఉమరాజ్‌యాదవ్ 842 గ్రాముల బంగారు రుద్రాక్షమాలను సమర్పించాడు. బంగారు రుద్రాక్షమాలను ఆలయ అర్చకులు స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌లకు అందజేశారు.

ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

దుర్గమ్మా.. మమ్ము దీవించమ్మా

పాపన్నపేట, మార్చి17 : పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో భక్తులు సందడి చేశారు. గతవారం ఏడుపాయల జాతర ముగిసింది. దీంతో ఈ ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కుకున్నారు. ఏడుపాయల దేవస్థాన కమిటీ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, రవివీర్ కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, బత్తిని రాజు, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్, రాజశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రంలోకి ఎవరికీ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నాపత్రం రిలీజ్ చేస్తాం. ప్రతి విద్యార్థి 12.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలో ఉండాలి. హాల్‌టికెట్‌పై ప్రధానోపాధ్యాయుడి సంతకం లేకున్నా పరీక్షకు అనుమతి ఉంటుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట డీఈవో

నిర్భయంగా పరీక్షలు రాయాలి

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు నిర్భయంగా పరీక్ష రాయాలి. జిల్లాలో మొత్తం 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తప్పవు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

-వల్లూరు క్రాంతి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్

సీసీ కెమెరాల నీడలో పరీక్షలు...

విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. ఒక్కో గదిలో 20 మంది విద్యార్థులను మాత్రమే కేటాయించాం. కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షలు సజావుగా నిర్వహిస్తాం.

-రాధాకిషన్, మెదక్ డీఈవో

లౌకిక వాదులకు ఓట్లేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మతోన్మాద శక్తులకు ఓట్లు వేయకుండా లౌకిక శక్తులకు వేసి గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లాకేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసి, దేశసంపద పూర్తిగా కార్పొరేట్ వ్యక్తులకు, శక్తులకు ధారాదత్తం చేస్తున్నదన్నారు.భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం అని, మతోన్మాద శక్తులను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లేశం, నాయకులు నర్సమ్మ, నాగరాజు, సంతోష్, అజయ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు

ఆదివారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రజాప్రతినిధులు

నాగల్‌గిద్ద, మార్చి 17: బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, నందుపాటిల్, కారముంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవికుమార్ బీజేపీలో చేరి ఒకరోజు గడవక ముందే నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వారు చేస్తున్న కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మేత్రి పండరి, జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీంద్రనాయక్, బీఆర్ఎస్ నాయకులు, జగ్గప్ప, అశోక్‌రావు పాటిల్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

అమీన్‌పూర్ బల్దియాలో పార్కుల అభివృద్ధి

- లింగమయ్య పార్కు, తులసీ వనం లేక్, శంభునికుంట లేక్‌ల అభివృద్ధికి హెచ్ఎండీఏ నిధులు
- రూ.3.63 కోట్లతో ల్యాండ్ స్కేపింగ్ పనులు
- చేపట్టనున్న హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం

అమీన్‌పూర్ మునిసిపాలిటీలో హెచ్ఎండీఏ చేపట్టే పనులు

తులసీవనం లేక్– రూ.74,98,083
శంభునికుంట లేక్ రూ. 74,64,700
పంచతత్వ పార్కు రూ. 7435871
లింగమయ్య పార్కు రూ.1,39,89,536

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ)/అమీన్‌పూర్: గ్రేటర్ శివారు ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అధిక ప్రాధాన్యతనిస్తోంది. జీహెచ్ఎంసీ పరిధి దాటిన తర్వాత కొత్తగా అభివృద్ధి చెందుతున్న మునిసిపాలిటీలు, ఇతర కార్పొరేషన్లలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం హెచ్ఎండీఏ ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు ఆయా పనులను స్వయంగా చేపడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ మహానగరం ఎవరూ ఊహించని విధంగా ఔటర్ రింగురోడ్డు దాటి విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణీకరణకు అనుగుణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా జీవ వైవిధ్యానికి ప్రాధాన్యిస్తూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు చెరువుల సుందరీకరణ, పార్కుల నిర్మాణం వంటి పనులు హెచ్ఎండీఏ చేపడుతోంది. తాజాగా గ్రేటర్ శివారులోని అమీన్‌పూర్ మునిసిపాలిటీలో 2 చోట్ల ఉన్న చెరువులు, మరో 2 పార్కుల అభివృద్ధికి మొత్తం రూ.3.36 కోట్ల నిధులతో ల్యాండ్ స్కేపింగ్ పనులను హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం చేపట్టనున్నది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లేక్ ప్రొటెక్షన్ కమిటీ చెరువుల సరిహద్దులను నిర్ణయించి వాటి పరిరక్షణకు చర్యలు చేపడుతుండగా, ఆయా చెరువులన్నీ స్థానికులకు ఆహ్లాదకరంగా మార్చేందుకు వాటిని అందమైన పచ్చిక బయళ్లతో తీర్చిదిద్దనున్నారు. పెద్దమొత్తంలో రకరకాల మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించేలా హెచ్ఎండీఏ కృషిచేస్తోంది.

ఐఐటీహెచ్‌లో ఎలాన్ వేడుకలు

కంది, మార్చి 17: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్–విజన్ 2024 వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా పలు ఐఐటీల నుంచి వచ్చిన విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా ఆదివారం హిప్ హాప్ ఇండియా ఛాంపియన్ షిప్ కోసం సోలో, డ్యుయో డ్యాన్స్‌లు చేశారు. స్పోర్ట్స్ క్విజ్ నిర్వహించడంతో పాటు హీలింగ్ లిటిల్ హార్ట్స్‌కు అనుగుణంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆశిష్ చౌహాన్ అవగాహన కల్పించారు. డీజే ఆర్గానిక్ ద్వారా విద్యుద్ధీకరణ, డీజే ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

ఎలాన్ వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ కక్షసాధింపు రాజకీయాలు

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ వేధింపులు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని టార్గెట్ చేసింది..
- సోదరుడిపై కేసులు పెట్టి మానసికంగా వేధించేందుకు యత్నం
- అక్రమ మైనింగ్ పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలకు వెన్నుదన్ను?
- టాస్క్‌ఫోర్సు నివేదిక ఇచ్చినా చర్యలు శూన్యం
- ఆరోపిస్తున్న గులాబీ శ్రేణులు

గూడెం మధుసూదన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి, మార్చి 17(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నదని, పార్లమెంట్ ఎన్నికల వేళ బలమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకునే కుట్రకు తెరలేపిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇందులో భాగంగానే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసిందని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన గూడెం మహిపాల్‌రెడ్డి లాంటి బలమైన నేత తమ పార్టీకి వస్తే బాగుందని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని, ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా ఆయన బీఆర్ఎస్‌ను వీడేందుకు ససేమిరా అనడంతో ఆయన్ను మానసికంగా దెబ్బతీసి తనవైపు తిప్పుకొనే కుట్రలు ప్రారంభించిందంటున్నారు. ఇందులో భాగంగానే అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. మూడునెలల వ్యవధిలో మధుసూదన్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు చేయడం టార్గెట్ చేసినట్లు స్పష్టం అవుతున్నదని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిడి మేరకు మధుసూదన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని, మదసూధన్‌రెడ్డి అరెస్టు వెనక రాజకీయకుట్ర కోణం ఉన్నట్లు స్పష్టం అవుతున్నదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. మధుసూదన్‌రెడ్డి అరెస్టు సమయంలో పోలీసులు నిబంధనలు పాటించలేదని, నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులపైనా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనను రాజకీయంగా ఎన్ని వేధింపులకు గురిచేసినా పార్టీ మారనని, కాంగ్రెస్‌ను రాజకీయంగా ఎదుర్కొంటానని, న్యాయవ్యవస్థ, చట్టాలపై తనకు గౌరవం ఉందని, తన సోదరుడిపై బనాయించిన అక్రమ కేసులు తొలిగి తమకు న్యాయం జరుగుతుందని గూడెం మహిపాల్‌రెడ్డి మీడియా సాక్షిగా చెప్పడంతో ఆయన్ను మరింత టార్గెట్ చేస్తారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

ఎమ్మెల్యే సోదరుడిపై చర్యలు.. కాంగ్రెస్ నేతలకు వెన్నుదన్ను

సంగారెడ్డి జిల్లాలో 200కు పైగా క్రషింగ్ కంపెనీలు ఉన్నాయి. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు, జిన్నారం మండలాల్లో ఎక్కువగా క్రషర్లు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలా కంపెనీలు మైనింగ్ లైసెన్స్‌లు పొందగా, తెలంగాణ ఏర్పాటు అనంతరం మరికొన్ని కంపెనీలు లైసెన్స్‌లు పొందాయి. తొమ్మిదిన్నర ఏండ్ల పాలనలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ క్రషర్ల జోలికి పోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అక్రమ మైనింగ్‌ను, అవినీతి, అక్రమ వసూళ్లను ప్రోత్సహించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైనింగ్‌పై దృష్టిపెట్టింది. మైనింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయంటూ మంత్రి దామోదర రాజనర్సింహ విచారణకు ఆదేశించారు. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి క్రషర్లపై విచారణ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని క్రషర్లపై కాకుండా కేవలం 71 క్రషర్లపైనే విచారణను మొదలుపెట్టారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు నడుపుతున్న క్రషర్లపై టాస్క్‌ఫోర్సు ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 62 క్రషర్ల కంపెనీలు నిబంధనలు ఉల్లంఘించాయని టాస్క్‌ఫోర్సు తన నివేదికలో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన క్రషర్ కంపెనీల్లో వేటిపైనా చర్యలు తీసుకోకుండా ప్రధానంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డిపైని టార్గెట్ చేస్తూ కేసులు పెట్టి అరెస్టు చేయించిందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతల క్రషింగ్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నా చర్యలు లేవని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ఎన్ఓసీలు లేకుండా, తమకు కేటాయించిన విస్తీర్ణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో మైనింగ్ చేస్తున్నా, వాతావరణ కాలుష్యానికి పాల్పడుతున్నా కాంగ్రెస్ నేతల క్రషర్ల జోలికి ప్రభుత్వం వెళ్లకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు గులాబీ నేతలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు పెద్ద నేతల క్రషింగ్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేసినా వారిపై కేసులు పెట్టకపోవటాన్ని వారు తప్పుబడుతున్నారు. సొంత పార్టీ నేతల మైనింగ్ కంపెనీలు కావడంతోనే వారిపై ప్రభుత్వం కేసులు పెట్టకుండా వెన్నుదన్నుగా నిలుస్తుందన్న ఆరోపణలు ఉన్నాయని, రాజకీయంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు గూడెం మధుసూదన్‌రెడ్డిపై కేసులు పెట్టి అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, నిబంధనలు ఉల్లంఘించిన తమపార్టీ నేతల మైనింగ్ కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటిని చూస్తుంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ సర్కారు టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతున్నదని వారన్నారు.